క్లుప్తంగా

నేడు మండలానికి ఎమ్మెల్యే బీరం రాక

పాన్‌గల్: మండలంలోని చింతకుంట, అన్నారం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో ఆదివారం పర్యటిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్న బీఆర్‌ఎస్



ఖిల్లాఘనపురం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను నీరుగార్చేందుకు చూస్తోందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి, మండల ఇన్‌చార్జ్ శ్రీశైలం, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండలస్థాయి కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకుండా సర్పంచులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కేంద్ర పథకాలను గడప గడపకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. శక్తికేంద్రాలు, బూత్ కమిటీల అధ్యక్షులు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధానకార్యదర్శులు ఆంజనేయులు, శివశంకర్, ఉపాధ్యక్షుడు రాంచందర్, రాజు, భద్రయ్య, మన్యం, రామస్వామి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆత్మకూర్: దళితులపై అకారణంగా దాడులకు తెగబడ్డ వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డిని కలిసి వినతి అందజేశారు. దళిత కాలనీపై దాడులకు పూనుకుని కులంపేరిట దూషించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అజయ్, రాజు, వెంకటేష్, సత్యం, వెంకటన్న, రాబర్టు, శివరాములు ఉన్నారు.

ఏఈగా బాధ్యతల స్వీకరణ



ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం విద్యుత్ శాఖ ఏఈ గా కొండయ్య బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఏఈ లేకపోవడంతో కొన్ని నెలలుగా ఇన్‌చార్జ్ ఏఈ గా విధులు నిర్వహించిన ఆయనకు ప్రభుత్వం ప్రమోషన్ ఇస్తూ.. ఖిల్లాఘనపురం మండల ఏఈ గా పూర్తి స్థాయి బాధ్యతలు ఇచ్చింది. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ నాగేంద్రకుమార్ చేతులమీదుగా ఆర్డర్ కాపీ తీసుకుని శనివారం మండల ఏఈగా బాధ్యతలు చేపట్టారు.

వరి సాగులో జాగ్రత్తలు అవసరం



అమరచింత: యాసంగిలో వరి పంటను సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు పాటిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చని ఏడీఏ దామోదర్ తెలియజేశారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. ఈ మేరకు రైతులతో కలిసి రైతు వేదికలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. స్థానిక పొలాల్లో జింక్ లోపాలు ఉన్నాయని, వీటిని గుర్తించామన్నారు. సరైన వ్యవసాయ సాగు పద్ధతులను పాటించాలని, ఏఈఓలు ఇస్తున్న సూచనలను ఎప్పటి కప్పుడు పాటించడంతో పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓ హరిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ రాజరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

పరికరాలు ఏవీ?



శ్రీరంగాపూర్ మండలంలోని ఈరకుంటలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- ఏళ్లు గడుస్తున్నా.. అందని ఉపాధిహామీ సామగ్రి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలు
- కనీస సౌకర్యాలు లేవని ఆవేదన
- అధికారులు దృష్టి సారించాలి

పెబ్బేరు: జాతీయ ఉపాధిహామీ పథకం కూలీలకు పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి కాలం సమీపిస్తున్నా.. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన వసతులపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగడంతో పాటు పనికి సంబంధించిన పరికరాలు అందక పని చేసేందుకు కూలీలు ఇబ్బంది పడుతున్నారు. వీరికి గతంలో పని ప్రదేశంలో గుడారాలు ఏర్పాటు, తాగునీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచేవారు. కనీసం భోజన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం కనీసం 'గ్రీన్ షెడ్ నెట్లు' ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. వీటికి తోడు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటం, ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉండటంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం హరితహారం నర్సరీల పనుల్లో కొందరు పనిచేస్తున్నారు.

కూలి రేటు పెంచాలి..

ఉపాధి హామీ పథకం కింద కష్టపడి పనిచేస్తున్నా.. కూలి రేటు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో బతుకుదెరువు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ.246 అందాల్సి ఉండగా.. రూ.120 మించి రావడం లేదని వాపోతున్నారు. ఏడాదికి కనీసం 200 పనిదినాలు పెంచడంతో పాటు కూలి రేట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వనపర్తి జిల్లాలో 255 పంచాయతీల పరిధిలో 1.42లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. ఇప్పటి వరకు 1.36 లక్షల మంది కూలీలు జాబుకార్డులను ఆధార్‌తో అనుసంధానం చేశారు. మిగతా వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయించలేదు.

ఏళ్లుగా అందని కిట్లు...

ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. సొంతంగా వాటిని సమకూర్చుకోవడానికి వారు ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో కూలీలు తాగునీటిని వెంట తీసుకెళ్తున్నారు. పనిచేసే సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక సమీపంలోని చెట్టు నీడలో కొంతసేపు సేద తీరుతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడంతో పాటు పెండింగులోని కూలి సొమ్మును వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వసతులు కల్పించేందుకు చర్యలు...



జిల్లాలో ప్రస్తుతం ఉపాధి కూలీల పనులు ప్రారంభమవుతున్నాయి. దీంతో పాటు వేసవి సమీపిస్తున్నందున కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. గతేడాది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందుల కిట్లు అందజేశాం. అన్ని పంచాయతీల పరిధిలో కూలీలకు తాగునీటి వసతి, ఇతర కిట్లు అందుబాటులో ఉంచాలని ఏపీఓలకు సూచించాం. కూలీల సంఖ్య పెరిగేందుకు ప్రత్యేక శ్రద్ధతో పాటు జాబుకార్డులను ఆధార్‌తో అనుసంధానం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో, క్షేత్రస్థాయిలో మొక్కలు పెంచేందుకు కృషి చేస్తూ.. సకాలంలో బిల్లులు అందేలా చూస్తాం.

– నర్సింహులు, వనపర్తి డీఆర్‌డీఓ

జిల్లాలో ఉపాధి వివరాలు..	గ్రామపంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీల సంఖ్య
	255	1,41,660	3,03,503
	పని చేస్తున్న కూలీలు 86,000	ఆధార్ అనుసంధానం 1.36 లక్షల మంది	

వృథాగా ఖాళీ గోనె సంచులు



పాన్‌గల్ సింగిల్‌విండో ఆవరణలో..



కేతేపల్లి కొనుగోలు ప్రాంతంలో బస్తాలు ఇలా..

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కేంద్రం ఆవరణలో, కేతేపల్లి గ్రామ కొనుగోలు కేంద్రం ప్రాంతంలో ధాన్యం సేకరణ కోసం తీసుకొచ్చిన గోనె సంచులు కుప్పలుగా పడి ఉన్నాయి. ధాన్యం సేకరణ పూర్తయి నెలలు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోపోవడంతో ఖాళీ బస్తాలు వృథాగా పడి ఉన్నాయి. ఆయా బస్తాలను తొలగించాల్సిన అధికారులు వాటి గురించి ఏమాత్రం పట్టించుకోపోవడంతో కేంద్రాల్లో అలానే ఉన్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి .వృథాగా ఉన్న ధాన్యం బస్తాలను సేకరించాలని రైతులు కోరుతున్నారు.

జమ్మాపూర్‌లో పశువైద్య శిబిరం

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేలు జాతి పశుగ్రాసాన్ని పెంచుకొని పాడిలో దాన ఖర్చులు తగ్గించుకోవాలని, సరియైన సమయంలో పశువుల ఎదని గుర్తించి ఎద సూదులు చేయించాలన్నారు. శిబిరంలో 26 పశువులకు గర్భ వ్యాధులకు, 38 పశువులకు సాధారణ వైద్య చికిత్సలు, 25 దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగిందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నమ్మ, పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, బుచ్చన్న, ఖుర్షీద్, రామస్వామి రైతులు పాల్గొన్నారు.



రైతులకు మందులు అందజేస్తున్న మండల పశువైద్యాధికారి, సర్పంచ్

నర్సరీ మొక్కల పరిశీలన



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ రఘురాములు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నర్సరీని శనివారం ఎంపీఓ రఘురాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీల్లోని మొక్కలకు క్రమం తప్పకుండా నీటి సదుపాయాన్ని అందించాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెరిగేలా చూడాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను పరిశీలించి మొక్కలు లేని చోటా కొత్తగా నాటాలన్నారు. జీపీలోని రికార్డులను ఆయన పరిశీలించి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని, జీపీల్లో చేపడుతున్న పనులను రికార్డుల్లో నమోదు చేయాలని, పన్నుల వసూలు వంద శాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నర్మద పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

అమరచింత: కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టణంలో రూ.3.5 కోట్లతో సీసీ రహదారులు నిర్మించే పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, కౌన్సిలర్ రాజ్‌కుమార్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణం గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

మదర్సా, మసీదు నిర్మాణాలపై ఫిర్యాదు



మున్సిపల్ ఆర్‌ఐకు వినతి అందజేస్తున్న జామీయ మసీదు కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలోని వ్యవసాయ పొలంలో కొత్తగా నిర్మిస్తున్న మదర్సా, మసీదు నిర్మాణాలకు మున్సిపల్ అనుమతి ఇస్తే తమకు తెలియపర్చాలని జామీయ మసీదు కమిటీ సభ్యులు శనివారం మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్యకు వినతి అందజేశారు. పట్టణంలోని ముస్లింల అభీష్టంతో రెండు మసీదుల నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం ఒక కుటుంబానికి చెందిన వ్యక్తులు పట్టణంలో మూడో మసీదు నిర్మాణ పనులు చేపడుతున్నారని, దీనికి అనుమతి లేదన్నారు. వీటిపై మరోమారు విచారించాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు తౌఫిక్, అయూబ్, కుతూబ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేకుల ఇల్లు దగ్ధం

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన ఎస్సీకాలనీ వాసి కుర్మయ్య రేకుల ఇల్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం అమ్మాయిపల్లిలోని ఎస్సీ కాలనీలో కుర్మయ్య రేకుల ఇంట్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు స్పందించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా.. ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. సంఘటన జరిగిన సమయంలో భార్యాభర్తలు ఇద్దరూ కూలి పనికి వెళ్లారు. సర్పంచ్ చక్రధర్ గౌడ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. షార్ట్ సర్క్యూట్‌లో దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు వాపోయారు.

అర్ధరాత్రి పెట్రోల్ బంకులో ఘర్షణ

పెబ్బేరు: మండల పరిధిలో రంగాపూర్ శివారులోని భారత్ పెట్రోల్ బంకులో శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు బంకు సిబ్బందితో ఘర్షణ చోటుచేసుకుందని శనివారం ఎస్‌ఐ రామస్వామి తెలయజేశారు. గద్వాల జిల్లా చెనుగోనిపల్లికి చెందిన ఇమ్రాన్, సాయిరాం, జయసింహ ముగ్గురు మద్యం మత్తులో ఉన్నారు. వీరు బైకుపై 44వ జాతీయ రహదారి రంగాపూర్ శివారులోని భారత్ పెట్రోల్ బంకు వద్దకి వచ్చి పెట్రోల్ కొట్టించే విషయంలో సిబ్బందితో ఘర్షణ పడ్డారు. దీంతో యజమాని తమ్ముడు అంతిరెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం శనివారం తల్లిదండ్రులను పిలిపించి వారి ఎదుట యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, వీరిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ తెలియజేశారు.

అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి ఆర్థికసాయం



పెబ్బేరు: మండల పరిధిలో వై శాఖాపూర్‌లోని అంగన్‌వాడీ ఆయా పుల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబానికి శనివారం ప్రభుత్వం తరఫున అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ, బాలీశ్వరమ్మ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

వనపర్తి: ప్రతి నెలా నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక ఈవీఎం గోదాంను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈవీఎంల భద్రతకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వారి వెంట ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి..

జిల్లా పరిపాలనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను శనివారం సాయంత్రం శివసేనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అలాగే బదిలీపై వెళ్లిన కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శివమాలధారులపై దాడిని నిరసిస్తూ ఫిర్యాదు

ఆత్మకూర్: శివ మాలధారులపై పూజారి కుమారుడు దాడి సంఘటనలో పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. శనివారం శివమాలధారులు స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా.. ఆలయ పూజారి కుమారుడు దాడికి పాల్పడ్డాడని గురుస్వామి రవికుమార్ తెలిపారు. ఈ ఆలయంలో కాకుండా వేరే ఆలయాలకు వెళ్లి పూజలు జరుపుకోవాలని పేర్కొనడంతో మాటమాట పెరిగి స్వాములపై చేయి చేసుకున్నాడని తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, కులం పేరుతో దూషించడంతో పాటు, స్వాములపై దాడి చేసిన పూజారి కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- వైద్యం, విద్య, వ్యవసాయానికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకెళ్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్ మండల పరిధిలోని మూలమల్లలో మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా నూతన హంగులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను సమకూర్చి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికబద్ధంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. తమ కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నేలపైనే కూర్చొని చదువుకున్నామని, ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావని, ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు అదృష్టంగా భావించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్య, వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ.. ముందుకెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఎంపీపీ బంగారుశ్రీను, వైస్‌ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో సీసీరోడ్లకు భూమి పూజ..

మూలమల్లలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు అభివృద్ధి పనులకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని, గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సర్పంచ్ ప్రశాంతి, ఎంపీటీసీ శ్యామల, మార్కెట్ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్ పాష తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొంకన్వానిపల్లి, నాగల్ కడ్మూర్ గ్రామాల్లో రూ.50 లక్షలతో నిర్మించిన పాఠశాలల నూతన తరగతి గదులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆయా పాఠశాలలో ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో, వాటిని గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి నిధులను మంజూరు చేశామన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ సంతరించుకుందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో రెండో విడత 'మన ఊరు–మన బడి' ద్వారా ఎంపిక చేసి నిధులను మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ చాంద్ పాషా, రాజేశ్వరమ్మ, వెంకటన్న, ఎస్‌.ఎ.రాజు, ఎంఈఓ భాస్కర్ సింగ్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆత్మకూర్: రాష్ట్రంలోని వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని సంఘం నాయకులు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతి అందజేశారు. శనివారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ఇదివరకే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని చర్చిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మండ్లవిజయ్, కొత్తబోయశేఖర్, సత్యన్న, భీమన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి..

317 జీఓతో స్థానికత కోల్పోయి జిల్లా జోన్ మల్టీ జోన్లు దాటి వేరే జిల్లాలకు బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతి అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఉద్యోగులకు స్థానిక జిల్లాల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి

పెబ్బేరు: మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని వనపర్తి రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని శనివారం మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ కోరారు. ఈ సందర్భంగా పెబ్బేరు వనపర్తి రోడ్డు మధ్య విస్తరణ పనుల్లో అధికారులు ఇచ్చిన మార్కింగ్‌కు కొన్ని ఇళ్లు కూల్చడం జరుగుతుందని, వీటిని ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, దీనికి లబ్ధిదారులు నష్టపోకుండా ప్రభుత్వ నిబంధనాల ప్రకారం ఆదుకుంటామన్నారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ జాన్ కృపాకర్, కౌన్సిలర్ పార్వతిగౌడ్, అధికారులు గణేష్ బాబు, రాజశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని వనపర్తి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ

ఫిష్ సీడ్ ఫారంపై అవగాహన



ఆరేపల్లిలో చేపల సీడ్స్ ఫారంపై అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రొఫెసర్లు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో శనివారం ఫిష్ సీడ్స్ ఫారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మండల ఆరేపల్లిలోని పుల్లి రాజేంద్ర ఫిష్ సీడ్స్, శివ ఫిష్ సీడ్స్ ఫారంకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మత్స్యకార్మిక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఫారంలో చేపలకు ఆహారం ఇవ్వడం, కలుపు మొక్కలను శుభ్రపరచడం, చేపల పంటకోత, ఆరోగ్యాన్ని తనిఖీ చేయడంతో పాటు వివిధ వ్యాధులు, వాటి చికిత్స, పద్ధతులపై పూర్తిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ముత్తప్ప ఖవీ, డాక్టర్ నాగలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.